క్లుప్తంగా

భాస్కర్ స్కూల్ మెరుపులు



విద్యార్థులను అభినందిస్తున్న కరెస్పాండెంట్ చుక్క భాస్కరరావు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భాస్కర్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మెరుపులు మెరిపించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ చుక్క భాస్కరరావు పాఠశాలలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తమ విద్యార్థులు మహ్మద్ ముబారక్–589, ఎస్ మోక్షిత–584, కౌశిక్–565, ఎ.ఎం.వర్షవర్ధన్–558, సీహెచ్ తనూజ–552, 500 మార్కులు పైబడి 12 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. తమ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కరస్పాండెంట్ ఈ సందర్భంగా అభినందించారు.

సురేష్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం



తెంటు జాహ్నవి(592)



బండి మోక్షిత(590)



మరదాన నిఖిత(588)

పార్వతీపురంటౌన్: పట్టణ సమీపంలోని సురేష్ ఐటీ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పదవతరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు పాఠశాల కరెస్పాండెంట్ గుడ్ల ప్రసాదరావు పాఠశాలలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ విద్యార్థిని తెంటు జాహ్నవి–592, బండి మోక్షిత–590, మరడాన నిఖిత–588 మార్కులు సాధించారని తెలిపారు. 550 పైబడి మార్కులను 75 మంది, 500 పైబడి 50 మంది సాధించారని, మొత్తంగా పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆయనఅభినందనలు తెలిపారు.

శ్రీకృష్ణ స్కూల్ ప్రతిభ



పి నిశిత(588)



కేఆర్‌డీ అమృత(587)



ఎస్ సాక్షి (579)



బి హర్ష వర్ధన్(577)

పార్వతీపురంటౌన్: పట్టణంలో గల శ్రీకృష్ణా స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. పాఠశాల కరెస్పాండెంట్‌లు అనిల్ కుమార్, అజిత్‌లు ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ విద్యార్థిని పి.నిశిత–588, కేఆర్‌డీ అమృత–587, ఎస్.సాక్షి–579, బి.హర్షవర్ధన్–577, ఎం.లక్ష్మీ అపూర్వ 573, చరణ్‌తేజ–568, కె.కల్యాణ్‌రామ్–568 మార్కులు సాధించారని తెలిపారు. 550 మార్కులకు పైబడిన విద్యార్థులు 12 మంది, 500 పైబడి 30మంది మార్కులు సాధించడంతో పాఠశాల శతశాతం ఉత్తీర్ణత పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు కోసం పోరాటం



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: దేశంలో కార్మికవర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ బలపరుస్తుందని సాలూరు కమిటీ వెల్లడించింది. ఈ మేరకు పట్టణంలో బుధవారం సమ్మె ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, శంకర్రావు, హరిబాబు, లక్ష్మి, రాముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సామగ్రి పంపిణీ

భామిని: మండలంలోని బొద్దగూడకు చెందిన 39 మంది గిరిజన రైతులకు మార్సియస్ పైనాపిల్ సాగుకు అవసరమైన బ్యాటరీ స్ప్రేయర్లు, వేపపిండి, వేపనూనెలను ఐటీడీఏ పీహెచ్ఓ గణేష్ బుధవారం అందజేశారు. వెలుగు అసోసియేషన్ స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు సాగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే హెచ్‌ఏ ఎ.ఎర్రన్న, ఎన్‌పీఎం మండల కోఆర్డినేటర్ మోటక అంబోజీ, ఐసీఆర్‌పీలు, గిరిజన రైతులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల హవా



పెదపెంకిలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ–1సామల సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు



సీతానగరంలో విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

బలిజిపేట: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు హవా కొనసాగించాయి. బలిజిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పది పరీక్షలలో 94శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ–1 సామల సింహాచలం తెలిపారు. మండలంలో 9ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి 382 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 359మంది ఉత్తీర్ణత సాధించారు. పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థి కోట సందీప్ 587 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల ఫస్ట్ సాధించగా నారన్నాయుడువలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ధరణి 585, బి.కావ్య 583 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అరసాడ, అజ్జాడ, పెదపెంకి ఉన్నత పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. వంతరాం ఉన్నత పాఠశాలలో బి.సింధు, శరణ్ కార్తికేయలకు 582 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు వచ్చేందుకు సహకరించిన ఉపాధ్యాయులు ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎంఈఓ–1సామల సింహాచలం అభినందనలు తెలిపారు.

జోగింపేట విద్యార్థికి 580 మార్కులు

సీతానగరం: మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(ఎస్ఓఈ) నుంచి 42 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో కె.సాయికుమార్ 580 మార్కులు సాధించాడు. గాదెలవలస ఉన్నత పాఠశాలలో పరీక్షలకు 68 మంది విద్యార్థులు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలలో చదువుతున్న బోను శ్రావణి 555 మార్కులు సాధించింది. సీతానగరం ఉన్నత పాఠశాల నుంచి పరీక్షల్లో 77 మంది విద్యార్థులు పాల్గొనగా 60 ఉత్తీర్ణత సాధించారు. వారిలో అత్యధికంగా బంక శ్రావణి 578 మార్కులతో సత్తా చాటింది.



కె.సాయికుమార్



వావిలపల్లి పవిత్ర



బి.హసీనా



పొన్నాడ శ్రీచరణ్

పాచిపెంటలో..



మీసాల శరణ్య (578)

పాచిపెంట: 10వ తరగతి ఫలితాల్లో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 10 పాఠశాలల్లో 95 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మీసాల శరణ్య 578 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించగా అదే పాఠశాలకు చెందిన మామిడి రూపశ్రీ.. 576 మార్కులతో రెండవ స్థానం సాధించింది. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పలువురు స్థానికులు అభినందనలు తెలియజేశారు.

సాలూరులో..

సాలూరు: పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థిని పి.తేజశ్విని 592 మార్కులతో ప్రథమస్థానంలో నిలవగా జ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థిని పి.గాయత్రి 589 మార్కులతో ద్వితీయ స్థానం, పురోహితునివలస మోడల్‌స్కూల్‌కు చెందిన కె.యోగేంద్ర 588 మార్కులతో సాలూరులో తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థుల కృషి అభినందనీయం

పార్వతీపురంటౌన్: విద్యార్థుల కృషి అభినందనీయమని ఎంఈఓ వై.విమలకుమారి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కార్యాలయంలో ఆమె సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ 591 మార్కులతో టీఆర్ఎంఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన చీకీర్తి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. మండలంలో 1615 మంది విద్యార్థులకు 1501 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, 114 మంది ఫెయిల్ అయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు.

మక్కువలో..



మక్కువ: విద్యార్థులను అభినందించిన ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు

మక్కువ: పదవ తరగతి ఫలితాల్లో మక్కువ మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మక్కువ గ్రామానికి చెందిన రుగడ.జ్యోత్స్న 587 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.మహిమ 585 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆలమూరు. సిరిచందన 584 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 91శాతం ఉతీర్ణత సాధించగా, ములక్కాయ వలస ఆదర్శ పాఠశాల విద్యార్థులు 98శాతం, ఎ.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 90శాతం, ఎర్రసామంత వలస ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 92శాతం, కాశీపట్నం కేజీబీవీ విద్యార్థులు 89శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు దుశ్శాలువాలతో సత్కరించి నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులను ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్ సుందర్ అభినందించారు.

తాళ్ళబురిడిలో శతశాతం ఉత్తీర్ణత



ప్రథమస్థానంలో నిలిచిన అంజలిని అభినందిస్తున్న పెదబొండపల్లి పాఠశాల ఉపాధ్యాయులు

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్ళబురిడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.తాళ్ళబురిడి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో 33 మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణత సాధించారు. అలాగే బందలుప్పి, లో 71మందికి గాను 66 మంది ఉత్తీర్ణత సాధించారు. పెదబొండపల్లిలో 66 మందికిగాను 55 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంఆర్ నగరంలో 92 మందికి 84 మంది, ములగలో 27 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారు. నర్సిపురంలో 56 మందికి 42 మంది పాసయ్యారు. అలాగే డోకిశీల, జీటీడబ్ల్యూఎస్‌లో 47మందికి 42 మంది, రావికోన జీటీడబ్ల్యూఎస్‌లో 28 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా మండలంలోని పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని భోగి అంజలి 587 మార్కులు సాధించి మండలస్థాయిలో (ప్రభుత్వ పాఠశాల విభాగం) ప్రథమ స్థానంలో నిలిచింది. ఆయా పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచడం పట్ల ఎంఈఓ విమలకుమారి, ఎంఈఓ–2 కె.ప్రసాదరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు జీవన్న

పార్వతీపురం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపంద చర్య అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కిరాతక హంతకుల దుష్ట చర్యలను సభ్య సమాజం ఖండించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం చేతగానితనం వల్లే ఉగ్రదాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈయనతో పాటు నాయకులు జి.సూరయ్య, రాజేష్, బాబు, తదితరులున్నారు.

వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



వ్యవసాయ పరికరాలను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు రమేష్

మక్కువ: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్వీ రమేష్ కోరారు. ఈ మేరకు మండలంలోని కొయ్యనపేట, కాశీపట్నం, కోనగ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ శాఖ అందించిన వరి నూర్పిడి యంత్రాలను బుధవారం వ్యవసాయ సంచాలకుడు రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ రాయితీపై రైతులకు అవసరమైన పరికరాలను అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శివరామకృష్ణ, బొత్స శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, దివ్య, రాంకుమార్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

పాలకొండ రూరల్: విద్యాసంస్థల పరిసరాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంతో పాటు పలు ఆలయం వద్ద డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధరుసుం విధించారు. తనిఖీల్లో ఏఎస్సైలు ఝాన్సీరాణి, ధర్మారావు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫేర్‌వెల్ సంబరాలు



వెంగళరాయపురం ప్రాథమిక పాఠశాలలో చిందు లేస్తున్న చిన్నారులు

బలిజిపేట: విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన ఫేర్‌వెల్ సంబరాలు అంబరాన్ని అంటాయి. 2024–25 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా 5వ తరగతి పాసై 6వ తరగతిలో కొత్త పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, ఇదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతో ఆప్యాయంగా వారివారి బంధాలను స్మరించుకుంటూ, ఉపాధ్యాయులతో సరదాగా గడిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కోలాటాలు, రకరకాల డ్యాన్సులు, మరికొందరు నృత్యాలు, నాటకాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా 5వ తరగతి నుంచి 6వ తరగతికి వెళ్లిపోతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు తగు మార్గదర్శకాలు సూచించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల ధ్రువీకరణతో రైతులకు ప్రయోజనం

గుమ్మలక్ష్మీపురం: పంటల ధ్రువీకరణతో రైతులకు ప్రయోజనం ఉంటుందని రెయిన్ ఫారెస్ట్ అలియన్స్ ప్రతినిధి రోజా చంద్ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డు, జట్టు సంస్థ ఆధ్వర్యంలో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు పంటలను తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, డీపీఓ పి.షణ్ముకరాజు, సిలబస్ డవలప్‌మెంట్ కన్సల్టెంట్ శివాజీ, నూకం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న రెయిన్ ఫారెస్ట్ అలియన్స్ ప్రతినిధి రోజా చంద్

వెంకటాపురం సర్పంచ్‌కు గ్రామస్తుల సత్కారం



సర్పంచ్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం పాఠశాలలో విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న సర్పంచ్ బి.శ్రీనివాసరావుకు బుధవారం గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. ఈ మేరకు హెచ్ఎం కూర్మినాయుడు మాట్లాడుతూ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు సొంత నిధులతో పాడుపడిన పాఠశాల గదిని రూ. 10 వేలు ఖర్చుచేసి తొలిగించారని, పాఠశాల ప్రహరీకి రూ 10 వేలుతో గ్రిల్ గేట్‌ను అమర్చారని, విద్య నేర్పుతున్న పాఠశాల విద్యావలంటీరుకు రూ 10 వేలు సమకూర్చారని తెలియజేశారు. సర్పంచ్ పాఠశాలలో విద్యాభివృద్ధికి సర్పంచ్ తోడ్పతున్నట్లు గుర్తించిన గ్రామస్తులు ఆయనను సత్కరించడం అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. గ్రామంలోని బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో రెల్లిలకు అన్యాయం చేయవద్దు



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న రెల్లి సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: ఎస్సీ వర్గీకరణలో రెల్లి, ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని రెల్లి సంక్షేమ సంఘం నాయకుడు జి. డానియల్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన చేయకుండా రెల్లిలకు ఒకశాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమన్నారు. రెల్లిల వెనుకబాటుతనాన్ని గుర్తించకుండా ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోకుండా చేసిన వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెల్లి కులస్థులు సోండి గౌరీశంకర్, పాలకొండ రాజశేఖర్, కోల నానాజీ పాల్గొన్నారు.

పక్షపాతం లేకుండా ఆక్రమణలు తొలగించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురంలో జరిగిన కబ్జాలన్నింటిపైన సమగ్ర దర్యాప్తు జరిపి ఆక్రమణలు తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా ఛైర్మన్ వంగల దాలినాయుడు స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పార్వతీపురం పట్టణం, మండలంలో జరిగిన చెరువులు, ప్రభుత్వ స్థలాల కబ్జాపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. రాజకీయ కక్షలకు తావివ్వకుండా ఏ పార్టీ వారైనా ఎంతటి వారివైనా వాటి పైకి బుల్డోజర్ తీసుకెళ్లి కబ్జాలు తొలగించాలని కోరారు. పార్వతీపురంలో పలు ప్రధాన చెరువులు దాదాపు ఆక్రమణకు గురయ్యాయని, వాటితోపాటు పట్టణం నలుదిక్కులా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. ఈ మేరకు వాటికి సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లతో పనిగట్టుకుని ఒకరిద్దరివి తొలగించడం సరికాదని, అందరి కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తీళ్ల గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికావొద్దు...



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఉపాధి హామీపథకం వేతనదారులు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట చెరువులో వేతనదారులు చేస్తున్న పనులను, వేతనదారుల మస్తరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు చేసిన చోట వేతనదారుల దాహార్తిని తీర్చడానికి చల్లనినీరు సమకూర్చుకోవాలని సూచించారు. అలాగే నీడ సౌకర్యం కల్పించ డానికి టెంట్‌లు ఏర్పాటు చేయాలని, దగ్గర్లో ఉన్న చెట్లచుట్టూ శుద్ధి చేసుకుని నీరు నీడలో ఉంచాలని చెప్పారు. ఎండలు తగ్గుముఖం పట్టినంత వరకూ వేతనదారులు సమయ పాలన పాటించాలని, తలకు తెల్లనివస్త్రాలతో పాగా, కాళ్లకు పాదరక్షలు ధరించేలా వేతనదారులకు టీఏలు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయాలి



చెత్తసేకరణకు బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి గౌరీశ్వరి

సీతానగరం: జిల్లా పంచాయతీ అధికారి సూచనల మేరకు గ్రామాల్లో గృహిణులు పంచాయతీ పాలకులు పంపిణీ చేస్తున్న బుట్టల్లో తడిచెత్త– పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని కార్యదర్శి గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాంలో బుధవారం సర్పంచ్ బి. శ్రీని వాసరావు ఇంటింటికీ రెండు బుట్టలు వంతున పంపిణీ చేశారు. ఈ మేరకు గౌరీశ్వరి మాట్లాడుతూ పెదంకలాం సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో చెత్తనుంచి సంపద తయారు చేయడానికి అవసరమైన చెత్తను గృహిణుల నుంచి సేకరించనున్నామన్నారు. చెత్త నుంచి సంపద తయారు చేయడానికి అవసరమైన ముడిసరుకును సేకరించే పనుల్లో గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

వచ్చే నెల 7న ఆదివాసీ ఆత్మగౌరవ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లోవరాజు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీ ఆత్మ గౌరవ సభ, ర్యాలీని మే 7న నిర్వహించనున్నట్లు ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజా సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో గౌరవసభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ ప్రచార కమిటీ వైస్‌చైర్మన్ ఆర్.లోవరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్ వల్ల ఏ ఒక్క ఆదివాసీల్లో కూడా సంతోషం లేదన్నారు. ఆదివాసులకు ప్రత్యేక ఉద్యోగ చట్టం చేయడం.. 1/70 చట్టం పరిరక్షించడం.. ఏజెన్సీలో ఉన్న ప్రతి ఆదివాసీకి టిడ్కో తరహాలో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించడం.. ఆశ్రమ పాఠశాలల్లో వైద్యసిబ్బందిని నియమించాలని కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దుక్క సీతారాం, ఇంటికుప్పల రామకృష్ణ, లక్ష్మయ్య, సూర్యం, కొండలరావు పాల్గొన్నారు.